క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు రాధ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు వాసుదేవ శర్మ విశేష పూజల అనంతరం శివ పార్వతులకు కల్యాణం జరిపించారు. భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

నంది వాహనంపై రామలింగేశ్వరుడు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నంది వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పూలమాలల అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడిని పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఊరేగింపు వాహన రథాన్ని పలు రకాల పూలతో అలంకరించారు. ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పండగ పూట కరెంట్ కష్టాలు

తాడిపత్రి రూరల్: పండగ పూట పట్టణ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. మహా శివరాత్రిని అత్యంత సంతోషంగా జరుపుకోవాలనుకున్న ప్రజలను విద్యుత్ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. పట్టణంలోని టైలర్స్ కాలనీలో దాదాపు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు ఆంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 6 గంటల సమయంలో మరోసారి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పట్టణంలోని కొన్ని కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. విద్యుత్ అంతరాయంతో ఉక్కపోతకు గురయ్యారు. కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో వంట చేసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు.

విలీన సభను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: మార్చి 2న రాజమండ్రిలో జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) విలీన సభను జయప్రదం చేయాలని ఆ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, రామాంజనేయులు, నాయకులు సత్తార్, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా జోలికి వెళ్లొద్దు



ఈశ్వరపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గుత్తి రూరల్: ప్రజలు నాటుసారా జోలికి వెళ్లకుండా దూరంగా ఉండాలని గుత్తి ఎక్సైజ్ ఎస్ఐ అస్లాంబేగ్ సూచించారు. మండలంలోని ఈశ్వరపల్లి, జక్కలచెరువు, టి.కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు నాటుసారా నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎక్సైజ్ ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా విక్రయించినా, తయారు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నాటుసారా తరలిస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి జిల్లా బహిష్కరణకు ప్రతిపాదిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ విజయకుమార్ పాల్గొన్నారు.

చితంబర స్వామి తిరునాల ప్రారంభం

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లలో చితంబరస్వామి తిరునాల బుధవారం ప్రారంభమైంది. ఏటా మహాశివరాత్రి సందర్భంగా తిరునాల జరపడం ఆనవాయితీ. చితంబర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉదయం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. గురువారం రాత్రి స్వామి వారి రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.



పామిడి: భోగేశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు





గుంతకల్లు టౌన్: అలంకరణలో భవానీ చంద్రశేఖర స్వామి, **గుత్తి:** శివుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం

శంభో శంకర..

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

గుంతకల్లు టౌన్: శివనామస్మరణతో పట్టణంలోని శైవక్షేత్రాలు మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో ప్రసిద్ధి చెందిన పాతగుంతకల్లు రామలింగేశ్వర స్వామి, కసాపురం రోడ్డులోని పాతూరు శివాలయం, శ్రీ భవానీ చంద్రశేఖరస్వామి, తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. శివాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. అలాగే పట్టణంలోని హుండేకార్ వీధిలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శివరాత్రి వేడుకలు జరిగాయి. మనుషులంతా కులమతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని.. అప్పుడే విశ్వశాంతి సాధ్యమని బ్రహ్మకుమారీలు సందేశమిచ్చారు.

వాసవీమాత ఆలయంలో..

స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నవరత్న లింగాలకు అర్చన, పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు రాజ్యలక్ష్మి, కల్పన, కోశాధికారి అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లో బుధవారం మహాశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుత్తిలోని కాశీ విశ్వేశ్వర దేవాలయం, నగరేశ్వరాలయం, నాగలింగేశ్వరాలయం, ఆర్ఎస్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం, గౌతమేశ్వరాలయాల్లో అర్చనలు, అభిషేకాలు, మహా మంగళ హారతి చేపట్టారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసిన అనంతరం రథోత్సవం నిర్వహించారు.

పామిడి: మండలంలోని శివాలయాల్లో బుధవారం మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భోగేశ్వరాలయం, నగరేశ్వరాలయం, కన్యకా పరమేశ్వరాలయం, విఠోబ ఆలయం, మడికట్ల ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశవార రుద్రహోమం తదితర పూజలు చేశారు. భజనలు, నృత్యాలు నిర్వహించారు.



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న జొన్నలగడ్డ పద్మావతి

శివలింగాలకు అభిషేకాలు

శింగనమల: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శివనామ స్మరణంతో శివాలయాలు మార్మోగాయి. భజనలు చేస్తూ భక్తులు జాగారం చేశారు. ఆలయాల్లో శివలింగాలకు అభిషేకాలు, పూజలు కొనసాగాయి. శింగనమల సమీపంలోని రుష్యశృంగుని కొండపై నున్న రుష్యశృంగుడు, శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శింగనమల మండలంతో పాటు, ధర్మవరం, నార్పల, తాడిపత్రి, పెద్దవడుగూరు, అనంతపురం నుంచి భక్తులు తరలివచ్చారు. అక్కమ్మ బావిలో స్నానం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్టవద్ద ఉన్న కాశీ విశ్వేర దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. మహా శివుడు, కాశీ విశాలాక్షి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కాశీ విశ్వేశ్వర దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక పూజలు చేయించారు.

గార్లదిన్నె/పుట్లూరు: కోటంకలో 108 సాలాగ్రశివలింగాలకు రుద్రాభిషేకం, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గార్లదిన్నె, కమలాపురం, కల్లూరులో శివ, పార్వతులకు కల్యాణం జరిపించారు. పుట్లూరు మండల కేంద్రంలోని భేగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి.

బుగ్గ సంగమేశ్వరాలయంలో భక్తుల సందడి





భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు, పూజలందుకున్న బుగ్గ సంగమేశ్వరుడు


గుంతకల్లు రూరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని బుగ్గ సంగమేశ్వరాలయం బుధవారం భక్తులతో పోటెత్తింది. ఆలయ పురవీధులు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజామునే సంగమేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించిన అర్చకులు.. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గుంతకల్లు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో పవిత్ర స్నానాలను ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. పార్వతీ సంగమేశ్వరులకు ఆలయ కోనేటిలో మంగళ స్నానాలను చేయించి వివాహ మహోత్సవానికి సిద్ధం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు నిరంతరాయంగా అన్నదానం చేశారు. నెట్టికంటి ఆంజనేయ స్వామి అనుబంధ దేవస్థానమైన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఏకాదశవార రుద్రాభిషేకం నిర్వహించారు.



పాత గుంతకల్లులోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం



గుంతకల్లు టౌన్: వాసవీమాత ఆలయంలో పూజలు







పుట్లూరు: అలంకరణలో భేగేశ్వరుడు, **శింగనమల:** రుష్యశృంగుడు, కాశీ విశాలాక్షికి పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



అర్ధ నారీశ్వరుడిగా బుగ్గరామలింగేశ్వరుడు



యాడికి: పూజలందుకున్న గౌరీ శంకరుడు



తాడిపత్రిరూరల్: అలంకరణలో జోడులింగాలు

పెద్దవడుగూరు: మండలంలోని చింతలచెరువు, చిన్నవడుగూరు, పెద్దవడుగూరు, లక్ష్మంపల్లి, కాశేపల్లి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రి సందర్భంగా శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించారు. శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. చిన్నవడుగూరులో కోలాటం, భజన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

యాడికి: రాయలచెరువు గౌరీ శంకర దేవాలయం, చందన కొండమీద రామలింగేశ్వర దేవాలయం, చిక్కేపల్లె గ్రామ బస్టాండు కూడలిలో ఉన్నశివాలయం, కోనుప్పలపాడు సమీపంలోని కోన క్షేత్రంలో ఉన్న రామలింగేశ్వరుడి ఆలయాల్లో సందడి నెలకొంది. కోనలో తిరునాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ప్రత్యేకంగా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు.

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతంలో బుధవారం వైభవంగా మహాశివరాత్రి పండుగ వేడుకలు జరిగాయి. శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచి శివాలయాలకు భక్తులు బారులు తీరారు. పార్వతీ సమేత పరమేశ్వర స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజామున దేవాలయానికి చేరుకోవడంతో అప్రమత్తమైన ఆలయ సిబ్బంది, బందోబస్తు పోలీసులు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు. బుగ్గరామలింగేశ్వర స్వామిని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి జేసీ ఉమారెడ్డి దర్శించుకున్నారు. వీరికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రైస్తవుల సమస్యలపై పోరాడతాం

పామిడి: క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతామని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు తెలిపారు. బుధవారం పట్టణం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ మండల కమిటీ ఏర్పాటుపై క్రైస్తవులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైపీ బాబు మాట్లాడుతూ.. క్రైస్తవ సంక్షేమంతో పాటు క్రైస్తవుల అభ్యున్నతి, సమస్యల పరిష్కార దిశగా కమిటీ పని చేస్తోందన్నారు. పామిడి మండల కమిటీ ఏర్పాటులో భాగంగా ఇక్కడికి రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిషప్ వాసు అనిల్ కాంత్, పాస్టర్లు అబ్రహాం, జాకోబ్, సాల్మాన్, పీసీ రత్నరాజు, వీరయ్య, అల్లీపీరా, అనిల్, సునిల్, సుహాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



హోమం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మహాశివరాత్రి సందర్భంగా అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శివపార్వతులను పట్టు వస్త్రాలతో అలంకరించి.. పెళ్లి మండపానికి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. హోమం నిర్వహించిన అనంతరం శివపార్వతులకు కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

వెండి కవచాల వితరణ



వెండి కవచం అలంకరణలో వినాయకుడు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని సంజీవ నగర్‌లో ఉన్న వేదగాయత్రి దేవాలయానికి సుమారు రూ.4,50,000 విలువైన రెండు వెండి కవచాలను (ఐదు కేజీలు) హాస్టల్ నాగిరెడ్డి కుటుంబ సభ్యులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామిని అర్చకులు వెండి కవచాలతో అలంకరించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా



పిన్నేపల్లిలో నీరు సరఫరా చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవ రాయుడు

యాడికి: రెండు రోజుల క్రితం మండలంలోని పిన్నేపల్లి ఎస్సీ కాలనీలో బోరుబావిలో నీరు అడుగంటి పోయాయి. ప్రజలు తాగునీటి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యుడు శ్రీరాములు వెంటనే వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడును కలిశారు. తాగునీటి సమస్యను విన్నవించారు. స్పందించిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు మహాశివరాత్రి సందర్భంగా ప్రజలు ఇబ్బంది పడకుండా బుధవారం సొంత నిధులు వెచ్చించి 6 ట్యాంకర్లతో నీరు సరఫరా చేయించారు. తాగునీరు సరఫరా చేయడంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడుకు ఎస్సీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో న్యాయవాది మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

తాడిపత్రి రూరల్: పట్టణంలోని టౌన్‌బ్యాంక్ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న న్యాయవాది చంద్రశేఖర్ (52) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. తాడిపత్రి బార్ అసోసియేషన్‌లో మెంబర్‌గా ఉన్నారు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు. న్యాయవాది చంద్రశేఖర్ మృతిపై బార్ అసోసియేషన్ కార్యవర్గం సంతాపం తెలిపింది.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

రాప్తాడురూరల్: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని అనంతపురం రూరల్ మండలం పాపంపేట ఆంజనేయస్వామి ఆర్చ్ వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర ఉచిత నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. పాపంపేటలోని బ్రహ్మంగారి గుడి నిర్వాహకులు, గ్రామ పెద్దల సహకారంతో నాటక ప్రదర్శన నిర్వహించారు. బ్రహ్మయ్యగా ఎం.ఓబిలేసు, 1వ సిద్దయ్యగా ఎస్.రాములయ్య, 2వ సిద్దయ్యగా వి.శ్రీరాములు, 3వ, 4వ సిద్దయ్యగా వి.ఆంజనేయులు, కక్కయ్యగా శ్రీరాములు, గోవిందయ్య, పీరూసాబ్‌గా చంద్రమౌళి, కాజీసాబ్‌గా ఎస్.రాములయ్య, వీరదాస్‌గా నాగప్ప, పోతులూరయ్యగా జి.నాగన్న తమ వేషధారణలో అలరించారు.

ఆటో దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న స్థానికులు

పెద్దవడుగూరు: మండల పరిధిలోని విరుపాపురం, గుత్తి అనంతపురం గ్రామాల మధ్యలో వైరింగ్ షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. అనంతపురానికి చెందిన దస్తగిరి అనే వ్యక్తి ఆటోలో పాత అట్టలు, పేపర్లు కొనుగోలు చేసే వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం గుత్తి నుంచి పెద్దవడుగూరుకు వస్తుండగా.. మార్గంమధ్యలో గుత్తిఅనంతపురం దాటిన తరువాత తాటివనంలోకి రాగానే ఆటోలో వైరింగ్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన దస్తగిరి డ్రైవర్‌తో కలిసి కిందకి దూకేశాడు. గట్టిగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న వారు తమ వాహనాలను ఆపి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. రూ.10 వేల సరుకుతో పాటు ఆటో కాలిపోవడంతో సుమారుగా రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆటోకు నిప్పు



కనంపల్లి క్రాస్ సమీపంలో మంటల్లో కాలిపోయిన ఆటోను పరిశీలిస్తున్న పోలీసులు

గార్లదిన్నె: మండల పరిధిలోని కనంపల్లి క్రాస్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున 44వ నంబర్ జాతీయ రహదారిపై ఓ ప్రధాన పత్రిక (సాక్షి కాదు) తరలించే ఆటోపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఈ ఘటనలో ఆటో కాలిపోయింది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాలు.. అనంతపురము పట్టణం రుద్రంపేటకు చెందిన మూర్తి.. ఆటోలో అనంతపురం నుంచి వజ్రకరూరు మండలం వరకూ దినపత్రిక తరలించే వాడు. బుధవారం తెల్లవారుజామున కనంపల్లి క్రాస్ వద్దకు రాగానే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి ఆటోను అడ్డుకున్నారు. ఆటోపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. మంటల్లో ఆటో కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా ఘటన స్థలాన్ని పరిశీలించారు. పత్రిక డిస్ట్రిబ్యూటరీ ఇన్‌చార్జ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

సాంకేతికతపై ఆసక్తి పెంచుకోవాలి



శ్రీహరికోట సందర్శనలో ఎస్ఆర్ఐటీ విద్యార్థులు

బుక్కరాయసముద్రం: తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధనా కేంద్రాన్ని ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. శ్రీహరికోటలో ఉపగ్రహ సాంకేతికత నైపుణ్యం, ఉపగ్రహాల నిర్మాణ శైలి, ప్రయోగాత్మక పరిశీలనపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. నేటి యువతకు సాంకేతికతపై ఆసక్తి పెంపొందించేందుకు ఈ సందర్శన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వీర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ కట్ట ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి కల్యాణ కట్టను ప్రారంభిస్తున్న సీనియర్ డీఎంఈ ప్రమోద్

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయంలో బుధవారం నూతనంగా నిర్మించిన కల్యాణ కట్టను డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రియాంక తదితరులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నూతన కల్యాణ కట్టలో శివ పార్వతులకు కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది.